# నిమిత్తమాత్రులు

అప్పటికింకా నేనుచిన్నవాణ్ణి. నా మేనమామ ఆ కుగ్రామంలో ఉపసర్పంచిగా నిలదొక్కుకునేందుకు వెంపరలాడుతున్నాడు. ఇప్పుడున్న రెండంతస్థుల భవనం అప్పటికి లేవలేదు. సరిగ్గా మా మామయ్య ఇంటికి ఎదురుగా రెండేరెండు పెంకుటిళ్ళు ఉండేవి. ఆ రెండింటినీ కలుపుతూ వీధిలో ఎత్తయిన అరుగు. చిన్న స్కూలు హెడ్‌మాస్టరుగా ఉన్న మాధవయ్య ఒక ఇంట్లో ఉండేవాడు. ఎప్పుడు చూసినా చిద్విలాసంగా కనిపించేవాడు.'ఏం చేస్తాం మనం నిమిత్తమాత్రులం'అని అనడం ఆయనకి పరిపాటి. శలవురోజుల్లో ఆ అరుగు కళకళలాడుతూ ఉండేది. చతురంగ బలాలు ఇరువైపులా మోహరించి పెద్ద పెద్ద యుద్ధాలు జరిగేవి ఆ గడపమీద. మాధవయ్యకు చదరంగం అంటే మహాపిచ్చి. ఎంత పిలిచినా మధ్యాహ్న భోజనానికి లేవకపోతే ఆయన భార్య కినిసి, నిరసనగా చదరంగం బల్లమీద గుమ్మడి వడియాలు పెట్టేసింది. ఆతర్వాత ఆ బల్లను వానలో పడేసింది. అలా చివికిపోయింది. ఇక ఆ అరుగు కళతప్పి, బోసిగా ఉండిపోయింది చాలాకాలం.

ఆ తర్వాత ఆ పక్క పెంకుటిల్లు కొనేసుకున్న చిన్న ఉద్యోగి భద్రయ్య ఏదో మాటల సందర్భంలో "మా ఇంట్లో మాంచి చదరంగం బల్ల మిగిలిపోయింది. కానీ ఏం లాభం? మా పిల్ల వెధవలు బలాన్ని చిందర వందరచేసి ఎక్కడో పారేశారు" అన్నాడు పెద్దగా నిట్టూరుస్తూ. ఆ మాటలు వింటూనే ఎగిరి గంతేసినంత పనిచేశాడు మాధవయ్య. "అలాగా! మరి చెప్పవెందుకూ? నా దగ్గర బలం ఉంది కానీ బల్ల లేక ఇన్నాళ్లూ కాళ్లు జాపుకొని కూర్చుండిపోయాను" అన్నాడు. అలా ఆ ఇద్దరూ కలిసి మళ్లా ఆ అరుగుమీద చదరంగాన్ని పునరుద్ధరించారు.

ఆదివారాలు ఆ అరుగు నేత్రపర్వంగా కళకళలాడిపోయేది. కాఫీ తాగిన వెంటనే మాధవయ్య అరుగుమీద చాప పరిచి నేను సిద్ధంగా ఉన్నాననే సంకేతాన్ని ఒక పొడి దగ్గుతో పంపేవాడు చేతిలో లక్క బరిణె పట్టుకుని గుటకలు మింగుతూ. ఆ సంకేతానికే నిరీక్షిస్తున్న భద్రయ్య చదరంగం బల్ల తెచ్చి చాపమీద పెట్టేవాడు. అంతేకాదు బల్లమీద రెండువేపులా

బలాల్ని పేర్చేసి, ఒక పావలా కాసుని గాలిలోకి విసరి ఆటకి నాంది పలికేవాడు.

ఆట ప్రారంభంలో ప్రశాంతంగా క్రమబద్ధంగా సాగేది. ఎవరి వ్యూహం వాళ్లది. ఏ బాధాలేదు. సంచీ పట్టుకుని కూరలకోసం బయలుదేరిన సాంబయ్య, మాధవయ్య వెనకనే కాస్త సేపు నిలబడేవాడు. ఆట పట్టులో ఉండగానే "ఇంకా ఆలోచిస్తావేమిటి? ఆ ఏనుగును తిన్నగా నడుపు..." అని మాధవయ్యను కవ్వించి హెచ్చరించేవాడు. ఏదో ఆఫీసలో గుమస్తా చంగల్రావు తన సీటులో పని పేరుకుపోయిందని ఆదివారం తీరిగ్గా ఒక పట్టు పట్టి బకాయి పనిలేకుండా చేసుకోవాలని స్థిర సంకల్పంతో బయలుదేరేవాడు. దారిలో అరుగుమీద సాగుతున్న చదరంగాన్ని ఒక్క క్షణం చూసిపోదామని వచ్చి భద్రయ్య వెనక చేరేవాడు. ఆట పట్టులో ఉండగా తన రెండు పిడికెళ్లూ బిగించి తనకు తెలియకుండానే నిలబడ్డవాడల్లా కూర్చుని జేబులోంచి పొడుండబ్బీ తీసేవాడు. భద్రయ్య దిక్కుతోచక ఆలోచనలోపడి తన దగ్గిరగా ఉన్న పొడుం డబ్బాని చేత్తో తడుముకునేవాడు. "ఇదిగో ఇదిగో ఇది తాజా నస్యం 'మద్రాసు బ్రాండ్' ఒక పట్టు పట్టు" అని కొత్త రుచిని మరిగిస్తూ "అద్గదీ- ఆ గుర్రంతో ఒక్క తాపు తన్ను-ఇక చూడు తమాషా" అని సలహా ఇచ్చేవాడు. భద్రయ్య తన మునివేళ్లతో అలా గుర్రాన్ని ముట్టుకున్నాడో లేదో "చూడు భద్రయ్యా! అలా పైవాళ్ల ఎత్తులు నాకు పనికిరావు సుమా!" అని ఉరిమేవాడు మాధవయ్య. మధ్యాహ్నం ఎండ చురుక్కుమనే సరికి ఇటు మాధవయ్య వెనక నలుగురూ, అటు భద్రయ్య వెనకాల నలుగురైదుగురూ నలచక్రవర్తులూ, ధర్మనందనులూ చేరి ఆ ఆటలో కసీ, వేడీ పెంచి పోషించేవారు. ఇక అది కురుక్షేత్ర సంగ్రామమే. వాదోపవాదాలూ, నిరసనలు, అరుపులు, గావుకేకలూ, పెడబొబ్బలూ, మూతిముడుపులూ- మధ్యవర్తులూ! ఇల్లాళ్లు ఇద్దరూ అల్టిమేటమ్ ఇచ్చేదాకా జరిగే తతంగం చూసి ఇక మళ్లా ఆ అరుగుమీద చదరంగం బల్ల కనిపిస్తుందా అనుకునేవాణ్ణి.

కానీ ఆ వచ్చే ఆదివారం యథావిథిగా ముసిముసి నవ్వులతో అరుగుమీద బల్లా, బలం అమర్చుకునేవారు. ఈ దృశ్యానికి అలవాడుపడ్డ నేను, ఈమధ్య మామయ్య శాసనసభకు ప్రజాప్రతినిధిగా పోటీపడుతున్న సమయంలో కట్టించిన రెండంతస్తుల మేడ బాగుంది చూడమని అమ్మ పోరితే వెళ్లాను. అంతేకాదు, ఆ గ్రామం మిడిల్ స్కూల్లో రెండు సంవత్సరాలు చదివిన అభిమానంకూడా లేకపోలేదు. అలా మేడమీద బాల్కనీలో కూర్చుని వేడి వేడి కాఫీ ఊదుకు తాగుతున్నాను.

ముచ్చటగా మళ్లీ అదే దృశ్యం. ఆరోజు ఆదివారంకూడా కాదు. కానీ మాధవయ్యా, భద్రయ్యా ఉద్యోగ విరమణ చేశారు. మాధవయ్య కళ్ల అద్దాలు పాతకాలం సోడాబుడ్డీ అడుగు అంత మందం అయిపోయాయి. భద్రయ్యలో కూడా మార్పు రాకపోలేదు. నుదురూ తలకట్టూ అన్న రెండు విభాగాలూ చెరిగి ఏకమైపోయాయి. మాధవయ్య వెనక

ఇద్దరూ అతని ప్రత్యర్థి వెనక ముగ్గురూ సలహాదార్లు చేరారు. కవ్వింపులు, ప్రగల్భాలు, అసమ్మతి నిట్టూర్పులూ, పెడబొబ్బలూ మామూలుగానే సాగాయి. నా చిన్నతనంలో సాయంత్రం ఎక్కడికైనా తోటల్లో ఆడుకుందుకు వెళ్లి తిరిగి వస్తూవుంటే రోడ్డుమీద కలిసిన మాధవయ్య నా భుజంమీద చెయ్యివేసి ఆప్యాయంగా పలకరించి నాచేత ఏవో మాట్లాడించి ముచ్చట పడేవాడు. ఆ సాయంత్ర మాధవయ్య ప్రశాంతంగా చుట్టకాల్చుకుని వస్తూ నన్నుచూసి పలకరించాడు. "ఏం చేస్తున్నావు?" అని అడిగాడు. "ఆర్థికశాస్త్రంలో ఎమ్మేచేసి ఉద్యోగ ప్రయత్నంలోఉన్నాను" అన్నాను. నేనంతటితో ఊరుకోక దేశ కాల పరిస్థితులు, రాజకీయ రంగంలో వస్తున్న మార్పులు, నా అసంతృప్తీ... వివరించాను.

చిన్నతనంనుంచీ ఆయన దగ్గర ఉన్న చనువుతో "మీ చదరంగం మాత్రం బాగా ఎప్పటిలా సాగుతోంది కానీ మీరు తరచూ అన్నట్లు 'నిమిత్తమాత్రులే ఏమంటారు?' అన్నాను.

తల పోట్లగిత్తలా కిందికి వంచి, ముక్కు చివరకు జారిన కళ్ల అద్దాల పై అంచులమీంచి నావేపు వింతగాచూస్తూ "మనమంతా నిమిత్తమాత్రులమే మరి..." అన్నాడు. "నీకెందుకలా అనిపించిందీ?" అని ఎదురు ప్రశ్న వేశాడు.

"చదరంగం బల్లా, బలం మీ ఇద్దరివేకానీ ఆడే ఆట- వేసే వ్యూహం మీదీ,భద్రయ్యదీ కానేకాదు. మీ చేతిమీదుగా మీ వెనక చేరిన ముఠా ఆడేసుకుంటున్నారు ఆట అంతా" అన్నాను-నా తెలివికి నేనే మురిసిపోతూ. నా వీపు తట్టి "పెద్దవాడివేకాదు మంచి మాటకారివికూడా అయిపోయావు" అన్నాడు మాధవయ్య. కాస్త స్వరం తగ్గించి "నువ్వేమీ అనుకోనంటే ఒక పాతకాలం ముచ్చట చెప్పానా?" అని నా కళ్లలోకి చూశాడు. చెప్పమన్నట్లు భరోసా ఇస్తూ ఉత్కంఠతో వింటున్నాను.

"నువ్వు... అప్పటికి హైస్కూల్ చదువుకని పట్నం వెళ్లిపోయావు. ఆ తర్వాత ఇటు రాకుండా మీ న్నాగారి దగ్గరే చదువుకున్నావు. ఆ రోజుల్లో మీ మామయ్య ఈ గ్రామానికి సర్పంచిగా నిలబడుతున్నాడని విని చాలామంది ఈ గ్రామానికి చేటుకాలం వచ్చిందని భయపడ్డారు. ఇంతలో ఇంకో ఇద్దరు గ్రామస్థులు బరిలోకి దూకి సర్పంచి పదవికి పోటీచేస్తున్నట్లు తెలిసింది. ప్రజలు హమ్మయ్య అని తృప్తిగా గాలి పీల్చు కున్నారు" అని మాధవయ్య కాస్త తన కథనం ఆపాడు.

"ఎందుకనీ?" అని అడిగాను.

"ఎందుకేమిటి? ఆ ఇద్దరూ కాస్తంత చదువూ మంచి చరిత్రా గుణం ఉన్నవాళ్లు. వాళ్లిద్దరిలో ఎవడు నిలిచినా గ్రామం బాగుపడుతుందన్న ఆశతో.

ఇలా ఉండగా మన ఊరి దయ్యాల చింతకింద ఒక రాత్రి నాలుగు గ్యాస్‌లైట్లు వెలిగించి

కొందరు సభ చేశారు. వాళ్లంతా మీ మామయ్యకు మద్దతు ఇచ్చేవాళ్లు. వాళ్లంతా మీ మామయ్య చొరవనీ, బలాన్నీ బలగాన్నీ, మీసాల్నీ ఎత్తుతూనీ పొగిడారు. ఆ తరువాత సభకు ముక్తాయింపు దరువు వేస్తూ ఒకడేమో ఒక సవాలు విసిరాడు. మెడకాయమీద తలకాయ తిరగాలని ఆశపడే వాడెవడైనా ఇలాటి నాయకుడితో పోటీపడేముందు బాగా ఆలోచించుకుంటే మంచిదని సలహా- అని. అందులోనే ఓ హెచ్చరిక ధ్వనించింది.

రెండురోజుల తర్వాత ఆ ఇద్దరు పెద్దలూ ఏవోకారణాలు చెప్పి, మీ మామయ్యకు పోటీగా నిలవకుండా తప్పుకున్నారని అందరూ విని ఆశ్చర్యపోయారు. ఆ తర్వాత ఒకరోజు బ్రహ్మాండమైన సభలో ఎక్కడోకానీ "ఈ గ్రామస్థులు మూడువేలమందికి ప్రతినిధిగా నే చెప్పేదేటంటే..." అని బల్లగుద్దుతూ ఉంటే నేనే విన్నాను. మీ మామయ్యకి పాదయాత్రలూ, ఇంటింటా తిరిగి ఓట్లకోసం ప్రచారం చేసుకోడం, బూత్లు ఆక్రమించుకోడం, రిగ్గింగ్‌లు చెయ్యడం లాటి అప్రజాస్వామిక పద్ధతులేవీ తెలీవు... మనం నిమిత్త మాత్రులమూ... అతనిలాంటి వాళ్లు కారణజన్ములూ..." అన్నాడు మాధవయ్య. ఏ సంకోచం లేదా మాటల్లో.

ఆతర్వాత ఎప్పుడైనా మాధవయ్యను చూడ్డం తటస్థిస్తే నేను నమస్కరించడమే కానీ ఛలోక్తి విసిరిన జ్ఞాపకం లేదు.

(ఈనాడు ఆదివారం, 8-1-1995)